

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 23 ఏప్రిల్ 2024





ఎస్.కోటలో మాట్లాడుతున్న చంద్రబాబు



సభకు హాజరైన ప్రజలు



అభివృద్ధికి పూచీ నాది

- ఆ జిల్లాలో ఈ నియోజకవర్గాన్ని కలిపేస్తా
- అవినీతి కోటగా మార్చేసిన వైసీపీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు
- సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబం కోళ్లది
- ప్రజాగళం సభలో చంద్రబాబు



నాగలితో టీడీపీ అభిమాని

- ఎంపీ టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ తాత ఎంవీవీఎస్ మూర్తి గీతం విశ్వవిద్యా లయాన్ని స్థాపించారు. ఎంతో మందికి విద్యాదానం చేస్తుండడంతో సహకరించాను. అలాంటి విశ్వ విద్యాలయాన్ని వైసీపీ ప్రభుత్వం కూలగొట్టింది. ఈ ప్రభుత్వం నచ్చని వారిని శుక్రవారాల్లో రాత్రి అరెస్టు చేయడం, ఆస్తులను కూలగొట్టడమే పని.
- పార్లమెంటు ప్రాతిపాదికన జిల్లాలను విభజించారు. ఎస్.కోట విశాఖ పార్లమెంట్ పరిధిలో వుంది. కాబట్టి విశాఖ జిల్లాలో కలపాలి. కానీ వైసీపీ మంత్రి బొత్స సత్యనారాయణ విజయనగరం జిల్లాలో వుండేలా చేశారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పనిచేశారు. ఇప్పుడు భార్య ఝాన్సీని విశాఖ ఎంపీగా నిలబెట్టారు. విజయనగరంలో దోచుకున్నది చాలక ఇప్పుడు విశాఖ మీద పడుతున్నారు.
- శృంగవరపుకోట తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి కుటుంబానికి సుదీర్ఘ రాజకీయ చరిత్ర వుంది. తాత కోళ్ల అప్పలనాయుడు తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌తో పని చేశారు. నాతోనూ పని చేశారు. పార్టీలో క్రమశిక్షణతో ఉండేవారు. నా సెలక్షన్‌లో లలిత కుమారికి ఎక్కువ మార్కులు వచ్చాయి. అందుకే టిక్కెట్ ఇచ్చాను.
- వైసీపీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శృంగవరపుకోటను అవనీతి కోటగా మార్చేశారు. వైసీపీ అధినేత జగన్ విశాఖ నగరంలోని రుషి కొండవద్ద రూ.500 కోట్లతో విలాస వంతమైన భవనాన్ని కట్టుకుంటే.. ఈ ఎమ్మెల్యే రూ.కోట్లతో కొత్తవలసలో ప్యాలస్ కట్టాడు. రెల్లి గ్రామ పరిధిలో బినామిల పేరుతో భూములను దోచుకుంటున్నాడు. తమ్ముడికి ఇసుక దందా, అనుచరులకు మద్యం దందాలను అప్పగించాడు.

-ఎస్.కోటలో టీడీపీ అధినేత నారాచంద్రబాబు నాయుడు

శృంగవరపుకోట, ఏప్రిల్ 22

టీడీపీ అభ్యర్థులు, వైసీపీ అభ్యర్థుల మధ్య వున్న తేడాను సోమవారం శృంగవరపుకోట ప్రజా గళం సభలో ఇలా వివరించారు. పార్టీ అధికారంలోకి రాగానే శృంగవరపుకోటను విశాఖ జిల్లాలో కలిపేస్తానని హామీ ఇచ్చారు. విశాఖ నగరాన్ని తలదన్నేలా శృంగవరపుకోటను అభివృద్ధి చేసే పూచీ తన దని భరోషా ఇచ్చారు. 'హైదరాబాద్ చుట్టూ వున్న రంగారెడ్డి జిల్లాను ఎలా అభివృద్ధి చేశానో.. అదే విధంగా శృంగవరపుకోటలో కూడా అభివృద్ధి జరుగ తుంది. విశాఖ-అరకు రోడ్డును అభివృద్ధి చేయడంతో పాటు ఇరు వైపులా పరిశ్రమలు స్థాపించే చర్యలు తీసుకుంటాం. అరకు పర్యాటక ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాను. జామి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొత్తవలస మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తాం. పుణ్యగిరి క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తాం. భీమసింగి చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేస్తాం' అని హామీ ఇచ్చారు. వైసీపీ నుంచి వలసలు ప్రారంభమయ్యాయని, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు భార్య సుధారాజు తన వర్గంతో పార్టీలో కలవడమే నిదర్శనమని అన్నారు. 'పార్టీ కోసం కష్టపడుతున్న సుధారాజు, నియోజకవర్గానికి ఏదో చేద్దామనే ఉత్సాహంతో పని చేస్తున్న గొంప కృష్ణకు ప్రాధాన్యం ఉంటుంది.

కూటమికు చెందిన ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారిలను గెలిపించాలని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలను కోరారు. నెల్లిమర్లలో జనసేన అభ్యర్థి లోకం మాదవిని కూడా గెలిపించాలన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత మూడు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు సమప్రాధాన్యం ఇస్తానన్నారు.

సైకో జగన్ పాలనలో మోసపోయాం..

సైకో జగన్ పాలనలో మోసపోయామని శృంగవరపుకోట శాసన సభ నియోజకవర్గ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం స్థానిక దేవిబొమ్మ కూడలి వద్ద ప్రజాగళం సభలో మాట్లాడారు. ఈ నియోజకవర్గం టీడీపీ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.

రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసింది..

వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసిందని విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ అన్నారు. ప్రజాగళం సభలో మాట్లాడుతూ వైసీపీ వ్యతిరేక ఓటు చీలకుండా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పొత్తుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ కూడా ఉన్నారు.

నేడు చంద్రబాబు పర్యటన ఇలా...

టీడీపీ అధినేత నారా చంద్రబాబు మంగళవారం గజపతి నగరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సోమవారం రాత్రి ఎస్.కోటలోని సిరికి రిసార్ట్స్‌లో బసచేశారు. మంగళ వారం ఉదయం 11 గంటలకు హెలికాప్టర్‌లో బొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన మహిళాగళం కార్యక్రమా నికి వెళ్తారు. తర్వాత శ్రీకాకుళం జిల్లాకు బయలుదేరతారు.



కూటమి హామీల ప్లకార్డులతో



విజయచిహ్నం చూపుతున్న మహిళలు



ఆనందంతో నృత్యం చేస్తున్న అభిమానులు

ఐదేళ్లలో ఏమీ చేయలే!



- అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- ప్రతిష్టాత్మకమైన గిరిజన విశ్వవిద్యాలయ భవనాలేవి?
- తాగు, సాగునీరిచ్చే రామతీర్థసాగర్‌పై తీవ్ర నిర్లక్ష్యం
- ఆధునికీకరణకు నోచుకోని తోటపల్లి కాలువ
- భోగాపురం విమానాశ్రయం ఎప్పుడో?
- నేడు జిల్లాలో 'సిద్ధం' సభకు సీఎం జగన్

(విజయనగరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లా అభివృద్ధి పూర్తిగా పట్టాలు తప్పింది. నిరుద్యోగులకు ఉపాధి లేదు.. ప్రాజెక్టులు పూర్తి కాలేదు... పరిశ్రమలు రాలేదు.. పర్యాటకం కళ తప్పింది.. కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వలేదు. వృత్తిదారులకు రుణాలు దక్కలేదు. ధరల మంటలు మాత్రం నింగికెగిశాయి. వెరసి అన్ని వర్గాలూ తీవ్రంగా నష్టపోయాయి. సీఎం జగన్ శంకు స్థాపన చేసిన గిరిజన విశ్వవిద్యాలయం ఎక్కడుందో నేటికీ చెప్పలేని దుస్థితి. ఈ వర్సిటీకి కేంద్ర ప్రభుత్వం రూ.300 కోట్లు మంజూరు చేసినట్టు పరిపాలనా పరమైన ఆమోదం తెలిపింది. అయినా భవన నిర్మాణం ప్రారంభించలేదు.

టీడీపీ హయాంలో కొత్తవలస మండలం రెల్ల గ్రామం వద్ద వర్సిటీ కోసం 500 ఎకరాలు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక స్థలాన్ని మార్చేసి గజపతినగరం, సాలూరు, దత్తిరాజేరు, మెంటాడ మండలాల సరిహద్దుకు తరలించారు. నేటికీ తరగతులు విజయ నగరంలోని ఏయూ పీజీ సెంటర్‌లో ఓ భవనంలోనే కొనసాగుతున్నాయి. బోధనా సిబ్బంది 91 మంది అవస రం కాగా 18 మంది మాత్రమే ఉన్నారు. 13 విభాగాలకు బోధనా సిబ్బంది లేక విద్యార్థుల ప్రవేశాలు తక్కువగా ఉంటున్నాయి.



- పాదయాత్ర సమయంలో విజయనగరం, గజపతినగరంలో డిగ్రీ కళాశాలలు, జామిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని జగన్ ప్రకటించారు. చెప్పారు కాబట్టి మొక్కుబడిగా రెండు డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. నేటికీ భవనాలు లేవు. జూనియర్ కళాశాల అడ్రస్సే లేదు.
- తారకరామతీర్థసాగర్ సాగునీటి ప్రాజెక్టు అత్యంత కీలకమైంది. భోగాపురం విమానాశ్రయ అవసరాలకు, విజయనగరం కార్పొరేషన్ ప్రజల తాగునీటికి ఈ ప్రాజెక్టు నీరే ఆధారం. 24,600 ఎకరాల సాగుభూమికి నీరు కూడా అందివ్వాల్సిన ప్రాజెక్టు ఇది. నిర్మాణంలో భాగంగా ఈ ఐదేళ్లలో ఒక్కపని కూడా చేపట్టలేదు.
- ఉమ్మడి విజయగనరం జిల్లాలో భారీ సాగునీటి ప్రాజెక్టు తోటపల్లి ఉన్నా ఉపయోగం లేకుండా పోతోంది. బొబ్బిలి నియోజకవర్గంతో పాటు, రాజాం, చీపురుపల్లి, ఎచ్చెర్ల, గజపతినగరం నియోజకవర్గాల్లోని రైతులకు సాగునీరు అందాలంటే గజపతినగరం బ్రాంచ్ కాలువ పనులు పూర్తికావాలి. నిర్మాణాన్ని మధ్యలో వదిలేశారు.
- మద్య నిషేధం ఉత్తమాటగా తేలిపోయింది. మహిళల ఓట్ల కోసం వేసిన ఎత్తుగడగా జగన్ సర్కారు తేల్చేసింది. మద్య నిషేధం చేయకుండానే ఐదేళ్ల పాలన పూర్తయ్యింది. ఏడాదికి 25 షాపులు తగ్గించలేదు.. సరికదా.. రకరకాల పేర్లతో షాపుల సంఖ్య పెంచుకుపోయింది.
- భోగాపురం విమానాశ్రయం గురించి లెక్కలేనన్ని సార్లు సీఎం ప్రస్తావించారు. పైగా మరోసారి శంకుస్థాపన కూడా చేశారు. పనులు మాత్రం నేటికీ ప్రారంభం కాలేదు.
- సంక్షేమ పథకాలంటూ నిత్యం ప్రచారం చేసే జగన్ బటన్ నొక్కినా.. చేయూత, ఆసరా లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమకాలేదు. ఈ నేపథ్యంలో జగన్ 'సిద్ధం' సభకు జిల్లాకు వస్తున్నారు. ఎందులో సిద్ధమంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఏజెన్సీలో ఆగని మృత్యుఘోష..

శృంగవరపుకోట రూరల్: దారపర్తి పంచాయతీ గిరిశిఖర గ్రామమైన గూనపాడు గ్రామంలో మూడేళ్ల పసిమొగ్గ జ్వరంతో రాలిపోయింది. ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినా మార్గమధ్యలోనే బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. గూనపాడుకు చెందిన బడ్నాయిన్ జీవన్ మూడేళ్ల కుమారుడు ప్రశాంత్ కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. వైద్య సిబ్బంది ఇచ్చిన మాత్రలు వేస్తున్నారు. సోమవారం ఉదయం 9గంటల సమయంలో జ్వరం ఎక్కువ కావడంతో బాబును తీసుకుని ద్విచక్ర వాహనంపై తండ్రి బయలుదేరాడు. పాపం పరిస్థితి విషమించి మార్గ మధ్యలోనే ఆ బాలుడు కన్నుమూశాడు. ఈ గ్రామానికి వైద్యులెవరూ వెళ్లరు. కిందిస్థాయి సిబ్బంది అప్పుడప్పుడు వెళ్లి తోచిన మాత్రలు ఇచ్చి వచ్చేస్తారు. ఈ కారణంతోనే బాబు పరిస్థితి విషమించింది. తాజా ఘటనపై జిల్లా వైద్యఆరోగ్యశాఖాదికారి భాస్కరరావును వివరణ కోరగా ఆ గ్రామంలో కొద్దిరోజుల క్రితం మలేరియా కేసులు నమోదు అవడంతో అప్రమత్తం చేశామని, బాలుడి మృతిపై విచారణ చేయిస్తానని చెప్పారు.



మార్గమధ్యలో చనిపోయిన కుమారుడ్ని ఆటోలో స్వగ్రామానికి తీసుకెళ్తున్న తండ్రి

జాబ్ క్యాలెండర్ ఏదీ?

కలెక్టరేట్: నిరుద్యోగుల కోసం ఏటా జనవరి ఒకటిన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ఆ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం జగన్ ప్రకటించారు. ఇది విని నిరుద్యోగులు తెగ సంబరపడ్డారు. నెలలు.. సంవత్సరాలు గడిచిపోయినా జాబ్ క్యాలెండర్ ఇవ్వకపోవడంతో జిల్లాలో పనిలేక ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేశారు. మిగిలిన ఉద్యోగాలేవీ తీయలేదు. దీనిపై నిరుద్యోగులు ఉద్యమించడంతో 2022 నవంబరులో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకూ ఈవెంట్స్ మాత్రం జరగలేదు.

బస్సులు లేక మళ్లీ అవస్థలేనా?

విజయనగరం రింగురోడ్డు: సిద్ధం సభలకు జిల్లా బస్సులను వాడడం ద్వారా ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు మన జిల్లాలోనే విజయనగరం మండలం చెల్లూరు గ్రామానికి సీఎం ఎన్నికల ప్రచార సభకు వస్తున్నారు. దీంతో ఏకంగా 130 బస్సులను ఆర్టీసీ కేటాయించింది. విజయనగరం డిపో పరిధిలో 90, ఎస్‌కోట డిపో పరిధిలో 40 బస్సులు సిద్ధం చేసినట్టు ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మంగళవారం ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సిందేనేమో.

సీఎం పర్యటన ఇలా..

విజయనగరం దాసన్నపేట: సీఎం జగన్ జిల్లాలోని విజయనగరం మండలం చెల్లూరులో మంగళవారం జరిగే సిద్ధం సభలో పాల్గొనున్నారు. విశాఖ జిల్లా ఆనందపురం నుంచి రోడ్డు మార్గాన రాజాపులోవ మీదుగా చెల్లూరు చేరుకోనున్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే సిద్ధం సభలో పాల్గొంటారు. అనంతరం తిరిగి రాజాపులోవ వచ్చి భోగాపురం, పైడిభీమవరం మీదుగా శ్రీకాకుళం జిల్లా రణస్థలం రోడ్డుషోలో పాల్గొంటారు. డీఐజీ విశాలగున్ని సిద్ధం సభ జరిగే ప్రాంతానికి సోమవారం సాయంత్రం చేరుకుని పోలీసు అధికారులతో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీడీపీ బొబ్బిలి అభ్యర్థిగా బేబీనాయన నామినేషన్

బొబ్బిలి, ఏప్రిల్ 22: బొబ్బిలి అసెంబ్లీ స్థానానికి తెలుగుదేశం-బీజేపీ-జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) సోమవారం నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీకి అందజేశారు. తొలుత వారి ఇలవేల్పు అయిన వేణుగోపాలస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దైవసన్నిధిలో వాటిపై సంతకాలు చేశారు. అక్కడ నుంచి నేరుగా గ్రోత్‌సెంటరులోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తన ఇద్దరు అన్నలు మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు, రామకృష్ణరంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుతో కలిసి నామినేషన్ ప్రతాలను అందజేశారు.



అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల వివరాలు

- చరాస్తులు: రూ. 3,19,53,154/-
- స్థిరాస్తులు: రూ. 16,46,00,000/-
- కొనుగోలు చేసిన స్థిరాస్తి: రూ.99,51,100/-
- దాని అభివృద్ధికి చేసిన ఖర్చు: రూ.1,00,000/-
- బేబీనాయన సతీమణి శిల్పారావు చరాస్తులు: రూ.71,99,116/-
- స్థిరాస్తులు: రూ. 76,26,000/-
- కొనుగోలు చేసిన స్థిరాస్తి: రూ.33,77,500/-

పదిలో 91.82 శాతం ఉత్తీర్ణత

- బాలుర కన్నా బాలికలే అధిక శాతం పాస్
- రాష్ట్రంలో జిల్లాకు ఐదో స్థానం

కలెక్టరేట్, ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో బాలురు కంటే బాలికలు ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు. 11,868 మంది బాలురు పరీక్ష రాయగా 10,671మంది(89.91) ఉత్తీర్ణులయ్యారు. 1197 మంది పరీక్ష తప్పారు. బాలికల విషయానికి వచ్చేసరికి 11,822 మంది పరీక్షకు హాజరు కాగా 11,081 మంది ఉత్తీర్ణత(93.73) సాధించారు. 741 మంది పరీక్ష తప్పారు. జిల్లా వ్యాప్తంగా 23,690 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 21,752(91.82 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. దీంతో రాష్ట్రంలో జిల్లాకు ఐదోస్థానం దక్కింది. పక్కనున్న పార్వతీపురం మన్యం జిల్లా కంటే మన జిల్లా ఉత్తీర్ణతలో వెనుకబడింది. ఈ ఏడాది మార్చి 18 నుంచి 30వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఫలితాల్లో 17,985 మంది ఫస్ట్ క్లాస్ సాధించగా, 2588 మంది సెకెండ్ క్లాస్ సాధించారు. 1179 మంది థర్డ్‌క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు.

గురుకులాల్లో 96 శాతం ఉత్తీర్ణత

సాలూరు రూరల్, ఏప్రిల్ 22: బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు ఉమ్మడి జిల్లాలో టెన్త్‌లో 96.41 శాతం ఫలితాలు సాధించాయి. వీటి నుంచి 976 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 941 మంది ఉత్తీర్ణత (96.41 శాతం) సాధించారు. 35 మంది పరీక్ష తప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 371 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 369 మంది (99.46 శాతం) మంది ఉత్తీర్ణులైనట్లు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ టి.పద్మ చెప్పారు. విజయనగరం జిల్లా నుంచి 526 మంది విద్యార్థులకు గాను 493 మంది (93.72 శాతం) ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. వంగర అంబేడ్కర్ గురుకులానికి చెందిన పి.సంజన 572 మార్కులతో ఉమ్మడి జిల్లా గురుకులాల్లో ప్రథమ స్థానం సాధించినట్టు ఆమె వెల్లడించారు.

టెన్త్‌లో శైలేష్‌కు 596 మార్కులు

కలెక్టరేట్: పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు చెందిన తొత్తడి శైలేష్ 596 మార్కులు సాధించారు. అలాగే తిరుమల రెడ్డి వెంకట్ శ్యామల శ్రీనిధి ఆపూర్వ 595 మార్కులు, బొంతలకోటి జోత్స్న 594 మార్కులు సాధించారు.



నెల్లిమర్ల మండలం సతివాడ ఆదర్శ పాఠశాలకు చెందిన గంపా ఈశ్వరరావు కార్తీక్ 594 మార్కులు సాధించారు. ఎం.బిందుపావనికి 594 మార్కులు, కె.జ్ఞానేంద్ర 594 మార్కులు, ఎం.కార్తీక్ నాయుడు 594 మార్కులు, టీపీఎస్ వర్షిని 594 మార్కులు సాధించారు.

పీపుల్స్ మేనిఫెస్టో

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి



సాలూరు రూరల్: ఉద్యోగులు ప్రజల్లో భాగమే. ఏ ప్రభుత్వమైనా ఎందుకో ఉద్యోగులను విడిగా చూస్తుంది. కోట్లాది రూపాయల ఆస్తులున్న వారికి తెల్లకార్డు ఇచ్చి సంక్షేమ పథకాలను ప్రభుత్వాలు అందిస్తున్నాయి. ఉద్యోగుల విషయంలో మాత్రం భిన్నంగా ఉంటున్నాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోవాలి. నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన ఆర్థిక ప్రయోజనాలను అందిస్తే ఉద్యోగులకు సమస్యలు ఉండవు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చేది ఉద్యోగ యంత్రాంగమే.

- కెల్ల వెంకటేష్, విజయనగరం డీపీఎం (మెడికల్), సాలూరు

టెండర్ ఓటు.. చాలెంజ్ ఓటు

(రాజాం రూరల్)

ఓటు హక్కు వినియోగించుకునే ప్రక్రియలో టెండర్ ఓటు.. చాలెంజ్ ఓటుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. టెండర్ ఓటు అంటే ఏమిటి? చాలెంజ్ ఓటు అంటే ఏమిటి? ఎలాంటి పరిస్థితుల్లో ప్రిసైడింగ్ అధికారి ఇలాంటి ఓటు వేసేందుకు అనుమతిస్తారో తెలుసుకుందాం.

చాలెంజ్ ఇలా...

ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి అసలైన ఓటరు కాదని పోలింగ్ ఏజెంటుకు అనుమానం వస్తే అతని గుర్తింపును ప్రశ్నించవచ్చు. రూ.2 ప్రిసైడింగ్ అధికారికి ఫీజుగా చెల్లించి దీనిపై విచారణ కోరవచ్చు. అప్పుడు సంబంధిత ఓటరును ధ్రువీకరణ కోసం తగిన ఆధారాలు చూపించాలని కోరుతారు. ఈ విచారణలో అతను అసలైన ఓటరే అని నిర్ధారణ అయితే ఓటు వేయడానికి అనుమతిస్తారు. ఇలా చేయడాన్ని చాలెంజ్ చేసే హక్కు (రైట్ టు ఛాలెంజ్) అంటారు. ఒకవేళ అసలైన ఓటరు కాదని తేలితే ప్రిసైడింగ్ అధికారి అతన్ని పోలీసులకు అప్పగించే అవకాశం ఉంది.

టెండర్ ఇలా...

ఓటు వేసేందుకు పోలింగ్ స్టేషన్‌కు వెళ్లే వ్యక్తికి .. తన ఓటును అప్పటికే ఎవరో వేసినట్లు తేలితే.. అతనికి టెండర్ ఓటు వేసేందుకు వీలుంటుంది. టెండర్ ఓటు కోసం ఓటరు అడిగినపుడు ప్రిసైడింగ్ అధికారి అతనికి ఒక బ్యాలెట్ పేపర్ ఇస్తారు. ఓటు వేసిన తరువాత దీన్ని ఒక కవరులో ఉంచి సీల్ చేసి భద్రపరుస్తారు. టెండర్ ఓటును ఈవీఎంలో వేయడం సాధ్యం కాదు.

పోస్టల్ బ్యాలెట్ అంటే..

ప్రతివ్యక్తికీ ఎన్నికలలో స్వయంగా ఓటువేసే హక్కు ఉంటుంది. కానీ, అత్యవసర సేవల్లో ఉన్నవారితో పాటు కొందరు ప్రత్యేక వ్యక్తులు, కుటుంబాలు, ఎన్నికల విధుల నిర్వహణలో ఉన్నవారు, పీడీ చట్టం కింద నిర్బంధంలో ఉన్నవారు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం ఉంటుంది. సైన్యం, పోలీసులు వంటి శాఖలను అత్యవసర సేవల విభాగంగా పరిగణిస్తారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ప్రత్యేక వ్యక్తుల కిందకు వస్తారు.



పేరుకు.. 100 సేవలకు.. 30

- ఇదీ గజపతినగరం ఆస్పత్రి పడకల తీరు
- ఇబ్బంది పడుతున్న బాధితులు
- హామీలు నెరవేర్చని మంత్రి, ఎమ్మెల్యే
- నత్తనడకనే పనులు

'ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నాం. అన్ని సదుపాయాలతో ఆస్పత్రులను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం.'...ఇదీ సాక్షాత్తూ ముఖ్యమంత్రి జగన్ నుంచి... మంత్రులు...ఎమ్మెల్యేల వరకూ...ఆఖరికి మండల స్థాయి నాయకులు సైతం ఐదేళ్లుగా ఎక్కడికక్కడ వినిపిస్తున్న పాట. కానీ వాస్తవానికి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో...ఆస్పత్రులు ఎలా ఉన్నాయో... అక్కడి సదుపాయాలు... భవనాలు ఏ స్థాయిలో ఉంటున్నాయో క్షేత్రస్థాయిలో చూస్తేనే తెలుస్తుంది. గజపతినగరంలోని 100 పడకల ఆస్పత్రి దీనికి ప్రత్యక్ష సాక్ష్యం.

(గజపతినగరం)

అది పేరుకే 100 పడకల ఆసుపత్రి.. సేవలు మాత్రం 30 పడకల్లో అందుతున్నాయి. వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నా వసతి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. దీంతో ఇక్కడికి వచ్చిన వారికి తూతూ మంత్రంగా చికిత్స అందించి... జిల్లా కేంద్రాసుపత్రికి రిఫర్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పుకుంటున్న వైసీపీ నాయకులకు క్షేత్ర స్థాయిలో ఇది కానరాకపోవడం దురదృష్టకరం. గత టీడీపీ ప్రభుత్వం నిధులు వెచ్చించినా.. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ పనులు పూర్తి చేయలేకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేలా టీడీపీ ఎమ్మెల్యే కేఏ నాయుడు గత ఎన్నికలకు ముందుకు రూ.17 కోట్లు మంజూరు చేయించారు. ఆ పనులు ప్రారంభించే దిశగా శంకుస్థాపన చేశారు. అంతలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిపి వేశారు.



నిర్మాణ దశలో ఉన్న ఏరియా ఆసుపత్రి భవనం

నీటి మూటలేనా?





'మా ప్రభుత్వం వచ్చింది.. పనులు వేగవంతం చేసి వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్ది మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్న మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య మాటలు నీటి మూటలేనా?' అంటూ నియోజకవర్గ ప్రజలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మంగళవారం ఈ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. హామీలపై ఆయన ఎలా స్పందిస్తారో చూడాలి.

అట్టహాసంగా శంకుస్థాపన..

2019లో వైసీపీ అధికారం చేపట్టింది. అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి బొత్స సత్యనారాయణ 2020లో రెండో పర్యాయం ఇవే పనులకు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. దీంతో పనులు త్వరతిగతిన చేపట్టి మెరుగైన సేవలు అందుతాయని నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురు చూశారు. ఐదేళ్లు గడిచినా పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఏరియా ఆసుపత్రికి తగినంత మంది వైద్యులు, సిబ్బంది ఉన్నా పడకలు లేకపోవడంతో చికిత్స కోసం వచ్చేవారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గజపతినగరం నియోజకవర్గం పరిధిలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాలతో పాటు సాలూరు నియోజకవర్గంలోని చెందిన మెంటాడ మండలానికి చెందిన ప్రజలు ఇదే ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. ప్రతి రోజూ 300 నుంచి 350 వరకు ఓపీ ఉంటుంది. రోగుల సంఖ్య పెరగడం.. ఆ స్థాయిలో వైద్య సేవలు అందించలేక జిల్లా కేంద్ర ఆసుపత్రికి, లేకుంటే ఘోషాసుపత్రికి చికిత్స కోసం వెళ్లాల్సి వస్తుందని స్థానికులు బాహాటంగానే చెబుతున్నారు. సీజనల్ వ్యాధులు వస్తే ఉన్న 30 పడకలు చాలకపోవడంతో ఒక్కో బెడ్‌పై ఇద్దరికి చికిత్స అందించాల్సి వస్తుందని వైద్య సిబ్బంది చెబుతున్నారు. నియోకవర్గ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆసుపత్రి కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నా.. వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దే దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తిరిగి ఎన్నికలు వచ్చేంతవరకు నెరవేర్చక పోవడంపై నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు(ఫైల్)



శబ్దం మోతాదు మించితే కేసు

విజయనగరం: ప్రస్తుతం అభ్యర్థులు ఎ న్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి వివిధ రూపాల్లో ప్రచార ఉధృతి పెంచారు. పెద్ద శబ్దాలతో ప్రచార సాధనాల ద్వారా తమ హామీలను వివరిస్తున్నారు. ఈ శబ్దాలు శృతిమించడంతో సామాన్యులకు అవస్థలు తప్పడంలేదు. చట్టపరంగా నిర్దేశిత ప్రాంతాల్లో ఏ మేరకు ధ్వని వినియోగించాలో ప్రత్యేక నిబంధనలకు ఈసీ రూపకల్పన చేసింది. నివాస ప్రాంతాల్లో 45-55 డెసిబుల్స్ దాటరాదు. వైద్యశాలలు, విద్యాలయాలు, న్యాయస్థానాల సమీపంలో 40-50 డెసిబుల్స్, వ్యాపార ప్రాంతాల్లో 55-65, పారిశ్రామిక ప్రాంతంలో 70-75 డెసిబుల్స్ ఉండాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు తీవ్రతను బట్టి జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది. అందుకే అభ్యర్థులు, ప్రచారకర్తలు అప్రమత్తంగా ఉండాలి.

ఈసీ ప్రత్యేకత అదే..

మీకు తెలుసా

భారతదేశంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ ఎన్నికల సంఘం. ఎన్నికల సమయంలో తన విశేష అధికారాలను వినియోగించుకుంటుంది. ఎవరికీ భయపడని రాజకీయ నాయకులు ఎన్నికలు వచ్చాయంటే ఈ సంఘానికి మాత్రం భయపడతారు. ఎన్నికల వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన ఘనత మాజీ కమిషనర్ టీఎన్ శేషన్‌దే. భారత ఎన్నికల సంఘ ప్రధాన అధికారిగా ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. రాజకీయ పార్టీలను గడగడలాడించారు.

- శృంగవరపుకోట

డిపాజిట్ గల్లంతంటే ఏంటి?

తెలుసుకుందాం

(విజయనగరం)



ఎన్నికల్లో అభ్యర్థులు ప్రత్యర్థులకు డిపాజిట్ కూడా రాదని చెబుతుంటారు. మరి డిపాజిట్ గల్లంతు అంటే ఏంటి? డిపాజిట్‌కు అవసరమైన ఓట్లు రాకపోతే ఏం జరుగుతుంది. ఎన్నికల ఫలితాల ప్రకటించిన సమయంలో అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను అధికారులు ప్రకటిస్తారు. ఆ సమయంలో డిపాజిట్‌కు అవసరమైన ఓట్లు కూడా అభ్యర్థికి రాలేదని వింటాం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ ఫారంతో పాటు నిర్ణీత డిపాజిట్ (ధరావతు) చెల్లించాల్సి ఉంటుంది. జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.ఐదు వేలు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఎన్నికల్లో పోలైన వాటిలో చెల్లిన ఓట్లలో ఆరో వంతుకు మించితే ఆ అభ్యర్థి చెల్లించిన డిపాజిట్‌ను తిరిగి చెల్లిస్తారు. లేకుంటే ఆ డిపాజిట్‌ను ఎన్నికల సంఘమే జప్తు చేసుకుంటుంది. ఎన్నికల ఫలితాలు రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురితం చేసిన తర్వాత మాత్రమే అర్హులైన అభ్యర్థులకు డిపాజిట్‌ను తిరిగి ఇచ్చేస్తారు.

ఆ బ్యాలెట్‌లో గుర్తులుండవ్..!



విజయనగరం: గుర్తులు లేకుండా ఎన్నికలు ఏంటా అని సందేహం రావచ్చు. అవును నిజమే.. పోస్టల్ బ్యాలెట్‌లో పార్టీ గుర్తులు ఉండవు. కేవలం అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. ఎన్నికల రోజు విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులు వేసే ఓటే పోస్టల్ బ్యాలెట్. ఇంతకుముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగే సమయంలో సాధారణ ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పత్రాన్ని ఉద్యోగులకూ ఇచ్చే వారు. వచ్చిన వాటిల్లో చివరి వాటిని తీసి పోస్టల్ ఓటు వేసే ఉద్యోగులకు అందజేసేవారు. ఈవీఎం యంత్రాలు వచ్చిన తర్వాత ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులు యంత్రంలో ఓటువేసే పరిస్థితి లేకపోవడంతో పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని బట్టి వారి ప్రాంతాల్లో పోటీచేసే అభ్యర్థి పేరు, పార్టీ పేరు ముద్రిస్తారు. గుర్తు ఉండకపోవడంతో అభ్యర్థి పేరు పక్కన టిక్ పెట్టాల్సి ఉంటుంది.

పోలింగ్ బూత్‌లో 1400 ఓట్లే ఎందుకు?



విజయనగరం: ఒక్కో పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా 1400 మంది ఓటర్లు ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేస్తారు. ఇలా ఎందుకు చేస్తారో తెలుసా? ప్రతి బూత్‌లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్స్. ఈ మూడు ఒకదానికొకటి అనుసంధానంగా పనిచేస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లకు అనుసంధానంగా ఉండే వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ అండ్ ట్రయల్)లో కాగితాన్ని పొందుపరుస్తారు. అది 1450 స్లిప్పులను మాత్రమే ముద్రిస్తుంది. బ్యాటరీతో పని చేసే వీవీ ప్యాట్‌లోని డిస్‌ప్లేలో ఓటు ఎవరికి వేశామన్నది కనిపిస్తుంది. అందులో 50 వరకు కాగితం, స్లిప్పులు, ఓటింగ్ రోజు మాక్ పోలింగ్ ప్రక్రియకు వాడుతారు. అందుకే ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1400 ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు.

నా అభిమానం కొద్దీ..!

బేబినాయనకు ఉపాధి వేతనదారుడి విరాళం


- ఆ రూ.1300ను నామినేషన్ రుసుంగా వెచ్చించిన వైనం



విరాళాన్ని చూపిస్తున్న వేతనదారుడు జగన్నాథం

బొబ్బిలి: బొబ్బిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బేబీనాయనకు ఉపాధి హామీ పథకం వేతనదారుడు తన వారం రోజుల సంపాదనను విరాళంగా అందజేసి అభిమానాన్ని చాటుకున్నాడు. బొబ్బిలి మండలం నారసింహునిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన కొండపల్లి జగన్నాథం రూ.1300ను బేబీనాయనకు విరాళంగా అందజేశాడు. తాను వారం రోజులపాటు ఉపాధి పనులకు వెళ్లి వేతనంగా సంపాదించిన మొత్తాన్ని ఆయనపై అభిమానంతో అందజేస్తున్నానని ప్రకటించాడు. దీనికి ఉబ్బి తబ్బిబ్బయిన బేబీనాయన మాట్లాడుతూ ఈ అభిమానానికి వెల కట్టలేమని అన్నారు. జగన్నాథం విరాళంగా ఇచ్చిన మొత్తాన్ని జగన్నాథస్వామి ప్రసాదంగా భావించి తన నామినేషన్ రుసుం కోసం వినియోగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, గ్రామ టీడీపీ నాయకుడు రెడ్డి మోహన్, మండల పార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు గుర్తింపు కార్డుకు 29 ఏళ్లు



విజయనగరం: దేశంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు స్వయం ప్రతిపత్తితో కూడిన ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకువస్తోంది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కావడంతో ఎన్నికల నిర్వహణ సంక్లిష్టంగా ఉంటుంది. ఈనేపథ్యంతో ప్రతిఓటరును గుర్తించేందుకు, దొంగఓట్లను అరికట్టేందుకు 1995లో అప్పటి ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టారు. ఈ గుర్తింపు కార్డులు అమలులోకి వచ్చి 29 సంవత్స రాలు పూర్తయ్యింది. ఓటరు జాబితాల్లో ఉన్న క్రమ సంఖ్య ప్రకారం ఫొటోను కార్డుపై ముద్రించి ఇస్తున్నారు. ఐడీ కార్డుపై పాస్‌పోర్టు సైజు ఫొటో, జనన తేదీ, చిరునామా సైతం ముద్రిస్తారు. సీరియల్ నంబరు, హోలోగ్రామ్ స్టిక్కర్, కార్డును జారీచేసిన అధికారి స్టాంపు, సంతకం కూడా ఉంటా యి. దీనిపై ముద్రించిన సీరియల్ నంబరు చాలాము ఖ్యం. ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా డేటాను ఆన్‌లైన్‌లో ఉంచ డంతో ఓటరు ఎన్నికల సంఖ్య సీరియల్ నంబర్‌ను సులభం గా తెలుసుకుంటున్నారు. వీటి స్థానంలో మారుతున్న సాం కేతిక పరిజ్ఞానం వినియోగించి ఎన్నికల సంఘం ప్రతి ఓట రు ఒక గుర్తింపు నెంబరుతో ఎపిక్ కార్డును ప్రస్తుతం జారీ చేస్తోంది. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఈ కార్డు అందజే స్తున్నారు. దీనిని ఇతర ప్రభుత్వ పథకాలను పొందేందుకు, భారతీయ పౌరుడిగా గుర్తింపు కోసం, చిరునామా కోసం అధికారికంగా వినియోగించుకోవచ్చు.

ఎవరో.. బొబ్బిలి పులి

కలుపుగోలుగా ఉండేవారు...

పెద్దల మాట



సాలూరు రూరల్: 1967వ సంవత్సరం నుంచి ఓటు వేస్తున్నాను. ఓటు వేయడానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బంగారమ్మపేటకు వెళ్లేవారం. పోటీ చేసే వారు రిక్షాలు ఏర్పాటు చేసేవారు. వాటిలో వెళ్లేవారం. ఏ పార్టీ రిక్షాలో వెళితే... దానికే ఓటు వేసేవాళ్లం. పోటీ చేసే వారు సైతం ఏ రిక్షాలో వచ్చినా ఆప్యాయంగా పలుకరించే వారు. అభ్యర్థులు అందరూ కలుపుగోలుగా ఉండేవారు. ఇప్పుడులా కడుపుమంట (అసూయ, కక్ష) ఉండేది కాదు. కాలం మారిపోయింది. ఇప్పుడు ఓటర్లను పోటీ చేసిన వారే విభజించుకుంటున్నారు. ఓటు అడిగిన తీరులో మార్పు గమనిస్తున్నాం.

- బలగ చిలకమ్మ (93), సాలూరు

బొబ్బిలి...రెండు తెలుగు రాష్ట్రాలలో... ఆమాటకొస్తే దేశంలోనే ఈ పేరు తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. 'బొబ్బిలి యుద్ధం'తో చారిత్రకంగా ఈ ప్రాంతానికి ఎంత ప్రాధాన్యం ఉందో... రాజకీయంగానూ అంతే ప్రాముఖ్యం ఉంది. పౌరుషం...అనే పదానికి పర్యాయపదంగా బొబ్బిలిని పిలుస్తారు. ఇప్పటికీ ఈ ప్రాంత రాజకీయాలు బొబ్బిలి రాజుల కనుసన్నలలోనే కొనసాగుతుండడం విశేషం.

- చారిత్రక ప్రాధాన్యం బొబ్బిలి సొంతం
- 'ఉమ్మడి' మద్రాసు ముఖ్యమంత్రి మన జమీందారు
- రాజకీయ చైతన్యానికి మారుపేరు
- ఈసారి ఎవరికి పట్టం కట్టేనో..

ఓటర్ల వివరాలు	
మొత్తం ఓటర్లు:	2,28,829
పురుషులు:	1,13,027
మహిళలు:	1,17,791
ఇతరులు:	11

(బొబ్బిలి)

విజయనగరం జిల్లాలో బొబ్బిలికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. పౌరుష.. పరాక్రమాలకు పెట్టింది పేరుగా నిలిచింది. విజయనగరం రాజులతో పోరాడిన చరిత్ర దీని సొంతం. బొబ్బిలి-విజయనగరం రాజుల మధ్య జరిగిన యుద్ధం చరిత్రలో బొబ్బిలి యుద్ధంగా ప్రసిద్ధి చెందింది. రాజకీయంగానూ తొలినుంచీ చైతన్యం కలిగిన ప్రాంతం. అంతర్జాతీయ స్థాయిలో పేరుగడించిన బొబ్బిలి వీణలు తయారయ్యేది ఇక్కడే. చేనేత వస్త్రాల తయారీకి పెట్టింది పేరు. పూర్తి వ్యవసాయ ఆధారిత ప్రాంతం. చెరకు పంట దిగుబడిలో రికార్డులు సృష్టించిన ఘనత బొబ్బిలిది. 60, 70 ఏళ్ల క్రితమే ఈ ప్రాంతంలో పంచదార, జనపనార పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. వెంగళరాయ సాగర్, తోటపల్లి, పారాది, వేగావతి తదితర నదులు, ప్రాజెక్టుల నుంచి సాగునీటి సౌకర్యాల కల్పన ఇంకా కొనసాగుతూనే ఉంది. రైతులు, రైతు కూలీలు, ఇతర చేతి వృత్తులు, స్వయం ఉపాధి వారు ఎక్కువగా ఉన్నారు.

పురాతన విమానాశ్రయం

బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బాడంగిలో రెండో స్వాతంత్ర్య యుద్ధ సమయంలో నిర్మించిన విమానాశ్రయం వృథాగా పడి ఉంది. గతంలో అక్కడ పెద్ద ఎత్తున గోధుమలను నిల్వ చేసేవారు. 1990వ దశకంలో బొబ్బిలి పట్టణంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పరిశ్రమల స్థాపనకు గ్రోత్‌సెంటరును ఏర్పాటు చేశారు. నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దీనిని ప్రారంభించారు. అప్పట్లో కేంద్రంలో జలగం వెంగళరావు పరిశ్రమల మంత్రిగా ఉండేవారు. ఆయన సహకారంతోనే గ్రోత్‌సెంటర్ మంజూరైంది.

ముఖ్య కార్యాలయాలు ఇక్కడే...

బొబ్బిలి ప్రాంతానికి చెందిన వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు రాష్ట్ర కేబినెట్‌లో ఇరిగేషన్, విద్య, హోం శాఖామాత్యులుగా పనిచేశారు. ఆయన ఈ ప్రాంతంపై మక్కువతో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు కలిపి ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంతో పాటు విద్యుత్, విద్యాశాఖ, పశుసంవర్థక శాఖకు చెందిన డివిజన్ కార్యాలయాలను బొబ్బిలికి మంజూరు చేయించారు.

- వెంగళరాయసాగర్, జంఝావతి, పెద్దగెడ్డ, తోటపల్లి ప్రాజెక్టుల మంజూరులో కీలక పాత్ర పోషించారు.

ఆయన హయాంలోనే పారాది, సీతానగరం తదితర ప్రాంతాలలో నదులపై వంతెనలను నిర్మించారు. గొలుసుకట్టు చెరువుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సంస్థానం ఉన్నత పాఠశాల, కళాశాలను ఏర్పాటు చేశారు. ఇక్క డ చదువుకున్న వారు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.

- ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే బొబ్బిలిలోని ప్రైవేట్ చక్కెర పరిశ్రమలను జాతీయం చేశారు.
- 1951లో పునర్విభజన జరిగినప్పుడు బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటైంది. 1952లో మద్రాసు స్టేట్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పరిధిలో ఉండేది. అప్పట్లో మొత్తం 61,326 మంది ఓటర్లు ఉండేవారు. సోషలిస్టు పార్టీ తరఫున కొల్లి వెంకటకూర్మినాయుడు 18,263 ఓట్లతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయనకు అప్పట్లో 4,386 మెజార్టీ వచ్చింది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన కోటగిరి సీతారామస్వామికి 13,877 ఓట్లు వచ్చాయి. కృషికార్ లోక్ పార్టీ తరఫున అంజలా వెంకటేశన్ పోటీ చేయగా... ఆయనకు 4,770 ఓట్లు వచ్చాయి.
- ఈ నియోజకవర్గంలో బొబ్బిలి పట్టణం, మండలం, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాలు ఉన్నాయి. అసెంబ్లీ నియోజవర్గాల పునర్విభజనకు మునుపు బొబ్బిలిలో బొబ్బిలి, సీతానగరం, బలిజిపేట మండలాలు ఉండేవి. పునర్విభజన తరువాత బలిజిపేట, సీతానగరం మండలాలు పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గంలో విలీనమయ్యాయి.

బొబ్బిలి ఎమ్మెల్యేలుగా వీరే..		
సం.	అభ్యర్థి	పార్టీ
1955	కోటగిరి సీతారామస్వామి	కాంగ్రెస్
1962	తెంటు లక్ష్మునాయుడు (సీనియర్)	కాంగ్రెస్
1967	ఎస్‌ఆర్‌కేఆర్ రావు	ఇండిపెండెంట్
1972	చెలికాని వెంకట కృష్ణారావు	కాంగ్రెస్
1978	కొల్లి వెంకటకూర్మినాయుడు	జనతా
1983	శంబంగి వెంకటచినఅప్పలనాయుడు	టీడీపీ
1985	శంబంగి వెంకటచినఅప్పలనాయుడు	టీడీపీ
1989	పెద్దింటి జగన్మోహనరావు	కాంగ్రెస్
1994	శంబంగి వెంకటచినఅప్పలనాయుడు	టీడీపీ
1999	పెద్దింటి జగన్మోహనరావు	కాంగ్రెస్
2004	ఆర్‌వీఎస్‌కే రంగారావు	కాంగ్రెస్
2009	ఆర్‌వీఎస్‌కే రంగారావు	కాంగ్రెస్
2014	ఆర్‌వీఎస్‌కే రంగారావు	వైసీపీ
2019	శంబంగి వెంకటచినఅప్పలనాయుడు	వైసీపీ

ఇలా మారిపోయాయి..

సాలూరు నియోజకవర్గంలో ఉండే రామభద్రపురం మండలం బొబ్బిలి అసెంబ్లీలో విలీనమైంది. ప్రత్యేకంగా ఉండే తెర్లాం అసెంబ్లీ నియోజకవర్గం రద్దయింది. ఆ నియోజకవర్గంలో ఉండే బాడంగి, తెర్లాం మండలాలు బొబ్బిలిలో విలీనమయ్యాయి. మెరకముడిదాం, గరివిడి, గుర్ల మండలాల్లో కొన్ని గ్రామాలు చీపురుపల్లి నియోజకవర్గంలో కలిసిపోయాయి. దత్తిరాజేరు మండలంలో కొన్ని గ్రామాలు తెర్లాం నియోజకవర్గంలో ఉండేవి. ఆ నియోజకవర్గం రద్దు కావడంతో ఆ గ్రామాలు గజపతినగరం నియోజకవర్గంలో కలిశాయి.


బొబ్బిలి నియోజకవర్గ ముఖచిత్రం



కొల్లి వెంకట కూర్మినాయుడు



తెంటు లక్ష్మునాయుడు (సీనియర్)





పెద్దింటి జగన్మోహనరావు



ఆర్‌వీఎస్‌కే రంగారావు



శంబంగి వెంకట చిన అప్పల నాయుడు

'ఆత్మీయత' ఓ నాటకం!

ఎన్నికల పట్టాభి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): 'అనుబంధం.. ఆత్మీయత..అంతా ఓ బూటకం' అన్నాడో సినీ కవి. అనుబంధం సంగతి ఎలా ఉన్నా.. ప్రస్తుత ఎన్నికల సమయంలో 'ఆత్మీయత' మాత్రం ఓ నాటకమేనన్నది అక్కడక్కడా చోటుచేసుకుంటున్న 'రాజకీయ' సంఘటనలను బట్టి తెలుస్తోంది. ఈ మాటల్లో నిజమెంతో తెలియాలంటే... ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ఎత్తుగడలు చూస్తే చాలు. ఓవైపు అభ్యర్థి ఖర్చులపై ఎన్నికల కమిషన్ నిఘా...మరోవైపు పైసలు తీయకపోతే 'కార్యకర్తలు' కరువైపోయే పరిస్థితి. ఇది పోటీలో ఉన్న వారికి మింగుడు పడడం లేదు. అందుకే తాజాగా నాయకులు 'ఆత్మీయ సమావేశాల'ను ఎంచుకుంటున్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకుల దృష్టిలో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇటీవల జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న ఓ బడా నేత బంధువు నామినేషన్ వేయడానికి భారీ సంఖ్యలో జనాలను తరలించారు. ఆ రోజు వచ్చిన 'పెయిడ్' కార్యకర్తలందరికీ మద్యం, బిర్యానీ, డబ్బులు ఇవ్వాలనేది ఒప్పందం. ఈ విషయాన్ని అధికారులు గుర్తించకుండా ఉండేందుకు ఓ కార్యకర్త పుట్టిన రోజు సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలకు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు కథ నడిపారు. నామినేషన్ వేసిన తరువాత జనాలకు నేరుగా డబ్బులు ఇవ్వకుండా... నియోజకవర్గానికి సమీపంలోని తోటలో పుట్టినరోజు వేడుకలు చేసుకున్నారు. మందు, విందు ఏర్పాటు చేసి... ఆ నియోజకవర్గ పరిధిలోని పంచాయతీల పెద్దలకు నగదు అందజేసి.. 'ఆత్మీయ సమావేశం' పూర్తి చేశారు.



'ఉమ్మడి' ముఖ్యమంత్రిగా...
మద్రాసు ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రిగా బొబ్బిలి జమీందార్ రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కే రంగారావు పనిచేశారు.



బొబ్బిలి కోట



ఏపీఐఐసీ గ్రోత్‌సెంటర్



వేణుగోపాలస్వామి ఆలయం

అమ్మా.. అమ్మా.. మాయమ్మా!

(చీపురుపల్లి)

ఏ పార్టీ అయినా.. నాయకులెవరైనా.. ఎన్నికల్లో పోటీ చేసేవారు ముందుగా కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవాల్సిందే. స్థానికులైనా, బయటి నుంచి వచ్చి బరిలో నిలిచిన వారైనా ఇది ఇక్కడి ఆనవాయితీ. ప్రచారం ప్రారంభించాలన్నా.. నామినేషన్ పత్రాలు సమర్పించాలన్నా.. ముందుగా అమ్మవారిని దర్శించుకుని.. ఆశీస్సులు తీసుకోవడం ఇక్కడి నాయకులకు అలవాటు. కొన్ని దవాబ్దాలుగా ఈ సంప్రదాయాన్ని అన్ని రాజకీయ పార్టీలు, నాయకులు అనుసరిస్తున్నారు. దీనిలో భాగంగానే చీపురుపల్లిలో కాలు మోపిన కూటమి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం విజయనగరంలో నామినేషన్ వేసిన వైసీపీ ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ కూడా ముందుగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మొదట్లో నమ్మకంతో నిర్వహించిన ఈ ప్రక్రియ రాను రాను సంప్రదాయంగా మారిపోయింది.
22 సిపిపి 2: చీపురుపల్లి పట్టణానికి సమీపంలో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం



చీపురుపల్లి పట్టణానికి సమీపంలో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం

నామినేషన్ల పర్వం



బొబ్బిలి: పార్టీ శ్రేణులతో ఊరేగింపుగా వెళ్తున్న బొబ్బిలి టీడీపీ అభ్యర్థి బేబీనాయన, పక్కన ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి...తమ అభిమాన నేతలకు అభినందనలు తెలిపారు.







నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వెళ్తున్న కురుపాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి, వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్

మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ప్రారంభించిన కలెక్టర్

కలెక్టరేట్: పోలింగ్ ప్రక్రియపై వివిధ వర్గాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నమూన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ నాగ లక్ష్మి సోమవారం ప్రారంభించారు. స్వీప్ కార్యక్ర మంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ అధికారుల స్థానాలు, ఓటింగ్ కంపార్ట్ మెంట్, ఏజెంట్ల స్థానాలు, నమూనా, ఈవీఎంలను ఏర్పాటు చేశారు. వీటిని కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. జేసీ కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివి నాగ్, స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ అధికారుల ఎంపికకు సెంచూరియన్ వీసీకి ఆహ్వానం

నెల్లిమర్ల: అసోసియేట్ ఎన్‌సీసీ అధికారుల ఎంపిక కార్యక్రమానికి అధ్యక్షత వహించాల్సిందిగా సెంచూరియన్ విశ్వవిద్యాలయం వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతికి ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కమోడోర్ అరవింద్ నగర్, కమాండింగ్ అధికారి కల్నల్ తపస్‌మండల్ ఆహ్వానం పలికారు. సోమవారం వారు సెంచూరియన్ విశ్వవిద్యాలయానికి వచ్చారు. విశాఖపట్నంలో జరగనున్న ఈ ఎంపిక కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఎ.సతీష్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్ పీఎస్‌వీ రమణారావు, డీన్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ సన్నిడి యోల్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

దత్తిరాజేరు: చౌదంతివలస గ్రామంలో 200 కుటుంబాలు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. సోమవారం వారిని ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంతో ఆర్థిక ప్రగతి

డెంకాడ: రైతులు సుస్థిర వ్యవసాయం చేయడం ద్వారా ఆర్థిక ప్రగతి సాధించవచ్చునని జడ్పీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డీడీ ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలో రొంగలి అక్కమ్మ పండిస్తున్న సేంద్రియ, ప్రకృతి విధానంలో పండిస్తున్న కూరగాయలు, అరటి పంటలను ఆయన సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు ఖరీఫ్‌లో వరి పంట వేసే ముందు బహుళ పంటలు సాగు చేసినట్లయితే నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని వివరించా రు. జడ్పీఎస్ఎఫ్ సూపర్‌వైజర్ సుజాత, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి కాలుష్యాన్ని తగ్గిద్దాం

విజయనగరం దాసన్నపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నియంత్రించేందుకు సహకరించాలని జాతీయ హరిత దళం డైరక్టర్ స్రవంతి అన్నారు. జిల్లా విద్యాశా ఖాధికారి ప్రేమకుమార్ ఆదేశాలతో సోమవారం కస్పా హైస్కూల్లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ, పాలిథిన్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ నిషేధించాలన్నారు. ప్రతి విద్యార్థీ మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం క ల్పించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కస్పా హైస్కూల్‌నుంచి మూడు లాంతర్లు వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

'భవిష్యత్‌కు గ్యారెంటీ'ని పూర్తి చేయాలి

వంగర: భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని గ్రామాల్లో త్వరగా పూర్తి చేయాలి మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రావు, పైలవెంకటరణ, కృష్ణమూర్తి అన్నారు. సోమవారం అరసాడలో నాయకులతో సమావే శమైన వారు గ్రామాల్లో ప్రచారం ముమ్మరం చేయాలన్నారు. చాలా గ్రామాల్లో కార్యక్రమం చేపట్టంలో కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించటం సరికాదన్నారు. సమ యము తక్కువ కావటముతో అధినాయకుని ఆశ యసాధనకు అంతా కృషిచేయాలన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని విధుల్లోంచి తొలగించాలి

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న భవానీని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని సీఐటీయూ నాయకులు ఎ.సురేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు మాసాల కింద పాల్తేరు పంచాయతీ కార్యదర్శిగా ఉన్న భవానీ అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఉద్యోగానికి దుమ్మా కొట్టి సస్పెండ్ అయి వెళ్లిపోయింది. అప్పటి నుంచి పాల్తేరు తాత్కాలిక కార్యదర్శిగా భీమవరం పంచాయతీ కార్యదర్శికి అదనపు బాధ్యతలు ఇచ్చారు. పై అధికారులు ఇప్పటికిప్పుడు ఎటువంటి అనుమతి లేకుండా సస్పెండ్ అయిన భవానీని కార్యదర్శిగా ఎలా తిరిగి విధుల్లోకి తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు వెంటనే ఆమెను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. ఈ విషయమై గతంలో స్థానిక ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీని ప్రశ్నించగా ఆమెకు మెమోలు ఇచ్చామని, ఉద్యోగంలో చేరకపోతే పూర్తిగా తొలగిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడెలా ఉద్యోగానికి అనుమతిస్తారని సీఐటీయూ నాయకుడు ప్రశ్నించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్య వివరిస్తామని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని సురేష్ తెలిపారు. అనంతరం ఎంపీడీవో ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు.

ధరిత్రి దినోత్సవం

చీపురుపల్లి: పట్టణంలోని రిక్షాకాలనీలోగల ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆశయ సంస్థ ఆధ్వ ర్యంలో ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి రమణ మాట్లాడుతూ పర్యావరణ పరిర క్షణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జగదీష్, భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక జీఎంఆర్ డీఏవీ పబ్లిక్ స్కూల్లో సోమవారం ధరిత్రి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విరకాస తరంగణి రాష్ట్ర కోఆర్డినేటర్ రమణమూర్తి పాల్గొని ప్రసంగించారు. భూమిని, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులదేనన్నారు. అనంతరం విద్యార్థులకు ఈ అంశంపై క్విజ్ నిర్వహించి, బహుమతులు అందించారు.

రక్తదానానికి ముందుకు రండి

రాజాం: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని నైరెడ్ డైరెక్టర్ రాజేష్ పిలుపునిచ్చారు. సోమవారం నైరెడ్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువకులు రక్తదానానికి ముందుకు రావడం ఎంతో గర్వించదగ్గ విషయం అన్నారు. రక్తదానం చేసిన 35 మంది శిక్షణా అభ్యర్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఏపీఎం నాగరాజు, కె నాగేశ్వరరావు, గార భూషణరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, నంది ఉమాశంకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటారు

- పది ఫలితాల్లో ప్రతిభ
- జిల్లా వ్యాప్తంగా ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ విద్యార్థులు



శేషాద్రినాయుడు(580) కడగలదీపిక(581) జైగణేష్ (585) శ్యామసిరి (580), కీర్తిశ్రీ(585)



నవ్య (576), చింత నవ్యశ్రీ (585), యామిని (585) తపస్విని (588), మనీషారాణి(587)

జిల్లా వ్యాప్తంగా సోమవారం విడుదలైన పదిఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అనేక పాఠశాలలు శతశాతం ఫలితాలు సాధించగా అనేక పాఠశాలల విద్యార్థులు ప్రవేటు స్కూళ్లకు దీటుగా మార్కులు సాధించారు.

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో గల ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 77 మంది పదోతరగతి పరీక్షలు రాయగా వారందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ రఘురామ్ తెలిపారు. కె.వరుణ్ (592), ఎం.హర్షవర్ధన్ (591), కె.రాకేశ్ (590) మార్కులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ● బొబ్బిలి మండలం నారసింహునిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చింతల కీర్తిశ్రీ 585 మార్కులు సాధించింది. పెంట జెడ్‌పీ హైస్కూలులో బండారు అక్షయ (562), చింతల ప్రసాద్ (560), లచ్చుపతుల భార్గవి (555) మార్కులు సాధించినట్లు హెచ్ఎం చిన్నారావు తెలిపారు. ● పారాది జెడ్‌పీ హైస్కూలులో పి.హేమలత 565 మార్కులు సాధించినట్లు హెచ్ఎం తెలిపారు. కోమటిపల్లి జెడ్‌పీ హైస్కూలులో 32 మందికి గాను 31 మంది విద్యార్థులు పాసయ్యారు.● పక్కి జెడ్‌పీహెచ్ఎస్‌లో 23 మంది పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారు. ● బొబ్బిలి పట్టణంలో గల కేజీబీవీలో 36 మంది పరీక్షలు రాయగా మొత్తం అందరూ ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ స్వప్న తెలిపారు. మండి నందినికి 553 మార్కులు, ఎం.జ్ఞాన ప్రసూనకు 550 మార్కులు వచ్చాయి. ● **రామభద్రపురం:** మండలంలో కొట్టక్కి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన చోడవరపు శ్యాంసిరి 580 మార్కులు సాధించారు. పాతరేగ, బూసాయవలస ప్రభుత్వ పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే రొంపల్లి పాఠశాలకు చెందిన పిట్టల జ్యోత్స్న 577 మార్కులతో 2వ స్థానంలో నిలిచింది. ● **బాడంగి:** స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ముగడ గ్రామానికి చెందిన మాసాబత్తుల జైగణేష్ పది ఫలితాల్లో 585 మార్కులు సాధించాడు. ఆరుగురు దివ్యాంగ విద్యార్థులు పరీక్షలు రాయగా శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ● **రేగిడి:** మండలంలో ఉంగరాడమెట్ట గురుకులం, దేవుదళ కేజీబీవీతో కలిపి మండలంలో 14 హైస్కూల్ నుంచి 672 మంది పది పరీక్షలు రాయగా వీరిలో 650 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 96.73 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వరప్రసాదరావు తెలిపారు. అంబాడవెంకటాపురం హైస్కూల్ విద్యార్థి కడగల దీపిక(581) లక్ష్మీపురం హైస్కూల్ విద్యార్థి నెల్లి శేషాద్రినాయుడు(580), కెంబూరు ప్రవీణ్(577), తెలుగు మీడియం నుంచి ఖండ్యాం హైస్కూల్‌కు చెందిన గంగు నవ్య(576), రేగిడి హైస్కూల్ విద్యార్థి పాలవలస జ్యోత్స్న (574) మార్కులు సాధించారు. ● **రాజాం రూరల్:** మండలంలో ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలుండగా ఎక్కువ మార్కులు బాలికలే సాధించారు. మండల పరిధిలోని పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని చింత నవ్యశ్రీ (585), రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అంధి శంకర్ (578), కంచరాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కలిశెట్టి శివ (577), డోలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అడ్డా శ్రావణి (577), గురవాంలోని కేజీబీవీ విద్యార్థిని కె.ఉపజ్ఞ 560 మార్కులు సాధించగా మున్సిపాలిటి పరిధిలోని సారధిలోని బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు కె.శిరీష, వై.లావణ్య 555 వంతున మార్కులు దక్కించుకున్నారు.

● **వంగర:** మండలంలో మడ్డువలస గురుకులం, వంగర కేజీబీవీ, వంగర జడ్పీ, అరసాడ జడ్పీ కలిపి మొత్తం 9 ఉన్నత పాఠశాలల్లో 94 పాస్ శాతంగా నమోదైనట్లు ఎంఈవో దుర్గారావు తెలిపారు. వంగర జెడ్పీకు చెందిన పాలవలస యామిని 585, చాందిని 577, కల్పన 571, రాగోలు శివ 576 మార్కులు సాధించారు. ● **గజపతినగరం:** మరుపల్లి ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. 81మంది పరీక్షలకు హాజరు కాగా, 80 మంది ఉత్తీర్ణులయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావు తెలిపారు. తపస్విని (588), మనిషారాణి(587), ప్రణతి(586) మార్కులు సాధించారు. అంజలి (581), షర్మిలనాయుడు(579) మార్కులు సాధించగా 22 మంది విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించారు. అలాగే గజపతినగరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పి.సందీప్ 572 మార్కులు సాధించారు. బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కడగల మల్లేశ్వరి (570), బాకి ఉమాదేవి(554), బుంగ కీర్తి (534) మార్కులు సాధించారు. గంగచోళ్లపెంట జడ్పీ హైస్కూల్‌లో ములగాడ తనూజ(554), బొని చంద్రిక (551) మార్కులు సాదించారు.

● **చీపురుపల్లి:** పదో తరగతి ఫలితాల్లో మండలంలోని జడ్పీ పాఠశాలలు 89.95 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మండలలోని జడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల నుంచి 776 మంది ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయగా, వారిలో 698 మంది ఉత్తీర్ణులయ్యారు. చీపురుపల్లి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్.గీత 583 మార్కులు, బి.నళిని 580 మార్కులు, మెట్టపల్లి పాఠశాలకు చెందిన ఎల్.హాసిని 579 మార్కులు సాధించారు. ● **బొండపల్లి:** మండలంలోని 8 జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ నుంచి 503మంది విద్యార్థులు హాజరు కాగా, 475 మంది ఉత్తీర్ణులయ్యారు. 94.43 శాతం ఉత్తీర్ణత సాధించారు. బొండపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థిని పూడి యామిని 589 మార్కులు, దేవుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.తేజశ్విని (587), గొట్లాం జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఐ.వేణు 576 మార్కులు సాధించారు. ● **దత్తిరాజేరు:** పది ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మండల పరిధిలో 469మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 447 మంది ఉత్తీర్ణులయ్యారు. షికారుగంజి ఆదర్శ పాఠశాలకు చెందిన తలారి గాయత్రి 586 మార్కులు, రాంబార్కి యోగేంద్ర 583 మార్కులు సాధించారు. కోరపుకొత్తవలసకు చెందిన గురుకుల పాఠశాలలో కామారెడ్డి శివశంకర్ 582 మర్కులు సాధించాడు. ఈ విజయ పట్ల ఎంఈవో ఎం.వెంకటరావు పాఠశాల ప్రిన్సిపాళ్లను అభినందించారు. ● **భోగాపురం:** భోగాపురం మండలంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 89 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. భోగాపురం ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎల్.బావనకు 588 మార్కులు వచ్చాయి. ● **గుర్ల:** పదో తరగతి ఫలితాలు సోమవారం విడుదల కాగా, గుర్ల జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి సారిక యశస్విత 575 మార్కులు సాధించింది. ఎంఈవో భానుప్రకాష్ అభినందించారు. ● **నెల్లిమర్ల:** పదో తరగతి పరీక్షల్లో సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు జి.ఈశ్వర్ కార్తీక్ 594, కొంకి జాహ్నవి 592 మార్కులు సాధించారు. నెల్లిమర్ల బాలికోన్నత పాఠశాలలో పి.సౌభాగ్య 571, వి.భానుమతి 571 మార్కులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యు.ధీరజ్ (553), అలుగోలులో ఆర్.శ్రావణి (566), బొప్పడాంలో సీహెచ్ దుర్గాదీక్షిత (591), జరజాపుపేటలో సీహెచ్ పూజిత (555), కొండవెలగాడలో ఎన్.కార్తీక్ (555), మొయిదలో పి.లావణ్య (568), పారసాంలో ఎస్.సౌజన్య (576), సారిపల్లిలో ఎస్.చరణ్‌తేజ (580), ఏపీ మోడల్ స్కూల్ సతివాడలో జి.ఈశ్వర్ కార్తీక్ (594), మత్స్యకార బీసీ బాలుర గురుకుల పాఠశాలలో బి.దుర్గాప్రసాద్ (572), ఎంజేపీ ఏపీ బీసీ బాలికల పాఠశలలో కె.ధరణి (585) మార్కులు సాధించారు. ● **గరివిడి:** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు 89.9శాతం ఉత్తీర్ణత సాధించాయి. పాత గరివిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో తుమ్మగంటి హరిత 580 మార్కులు సాధించింది.● **డెంకాడ:** అక్కివరం ఆదర్శ పాఠశాలకు చెందిన పతివాడ సాయికుమార్ 576, పెదతాడివాడ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పి.శిరిష 572 మార్కులు సాధించారు.



ప్రణతి(586), అంజలి(581), పూడి యామిని (589), తలారి గాయత్రి(586), భావన(588), కొంకి జాహ్నవి(592)

పల్లవి విద్యార్థుల విజయకేతనం



విజయకేతనం తెలుపుతున్న పల్లవి హైస్కూల్ విద్యార్థులు

విజయనగరం రింగురోడ్డు/రూరల్: పదో తరగతి ఫలి తాల్లో కొత్తపేట, మండపం వీధిలో ఉన్న పల్లవి విద్యా మందిర్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. టీవీఎస్ శ్రీనిధ్ అపూర్వ 595 మార్కులు, ఎం.ఓంకార్(587), బి.సాయి సాత్విక్(585) వి.మయాంక్ (583), కె సాయి ప్రణీత్(574), పి.దినేష్(574) మార్కులు సాధించారు. విజయం సా ధించిన విద్యార్థులను స్కూల్ కరస్పాడెంట్ చప్పా శేఖర్ అభినందించారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి




మాట్లాడుతున్న టీడీపీ నేత అదితి

విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా 'ప్రజాగళం' పేరిట విజయన గరం నియోజకవర్గ పరిధిలోని కలెక్టరేట్ జంక్షన్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు ఈ సభకు ముఖ్య అతిథులుగా హాజరౌతారని, సాయంత్రం ఐదు గంటలకు ఈ సభ జరుగుతుందన్నారు. నగరంలోని 50 డివిజన్ల పరిధిలో వున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల పరిధిలో వున్న 22 గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు, బీజేపీ, జనసేన పార్టీ శ్రేణులు, నాయకులు ఈ సభకు హాజరై విజయవంతం చేయాలన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారు బాబు, బొద్దల నర్సింగరావు, కంది మురళీనాయుడు, కర్రోతు నర్సింగరావు, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

విజయనగరం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. విజయనగరం మండల పరిధిలోని కోరాడపేట గ్రామంలో వైసీపీకి చెందిన కోరాడ శ్రీకాంత్, కోరాడ వేణుగోపాల్, బంకపల్లి శ్రీను, పిల్లి సునీల్‌కుమార్‌తో పాటు పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వారికి అదితి గజపతిరాజు పసుపు కండువా వేశారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ని తయారు చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆమె కోరారు.

అప్పుల రాష్ట్రంగా తయారుచేశారు



పార్టీలో చేరిన వారితో కళా వెంకటరావు

గరివిడి: రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పరిపాలన అప్పుల అప్పారావు పరిపాలనగా తయారైందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు అన్నారు. సోమవారం రాత్రి కోడూరు, ఏనుగువలస, కె.పాలవలస గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం కె.పాలవలస సర్పంచ్ మీసాల ప్రసాద్‌తో పాటు సుమారు 150 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, పార్టీ నాయకులు పైల బలరాం, బలగం వెంకట్రావు, సారిపాక సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: చీపురుపల్లి మేజరు పంచాయతీ పరిధిలోని ఆకులపేటలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి కమిడి కళావెంకటరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన మీసాల హరికృష్ణ ఆధ్వర్యంలో వీరంతా టీడీపీలో చేరారు. పార్టీ నాయకులు కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాగళం సభకు పటిష్ట భద్రత



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ తదితరులు

బొండపల్లి: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం బొండపల్లి మండలం రానున్న నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని గజప తినగరం సీఐ ఎన్‌బీ.ప్రభాకరరావు తెలిపారు. పార్టీ శ్రేణులు చేపట్టిన ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. ప్రజలు ఎటువంటి అవస్థలు పడకుండా తాగునీటికి, నీడకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వాహన రద్దీ చోటు చేసుకోకుండా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని సూచించారు. హెలీప్యాడ్, సభాస్థలంలో చేపట్టవలసిన ప్రత్యేక భద్రతపై స్థానిక ఎస్ఐ కసిరెడ్డి లక్ష్మణరావుకు ఆదేశించారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

వంగర: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును స్వేచ్ఛగా వేసుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. చాలా గ్రామాల్లో ఇప్పటికే పలువురిపై బైండోవర్ చేశామన్నారు. వివాదస్పద గ్రామాలపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు వివరించారు.

జగన్ పాలనలో గ్రామాలు మరుగున పడ్డాయి



మాట్లాడుతున్న కోండ్రు మురళీ

రాజాం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు మరుగున పడ్డాయని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. సోమవారం రాత్రి మండలం వేగిరెడ్డిపేట, కొత్తపేట, నరిశింహపురం, ఇల్లంనాయుడువలస, గెడ్డవలస తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ప్రజలు ఆదరించి అఖండమైన మెజార్టీతో విజయం ఇవ్వాలని కోరారు. వంగా వెంకటరావు, మంగం రమేష్, పల్ల వెంకటరావు, నాగళ్ల అప్పలనాయుడు, రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన కోసం రాష్ట్ర ప్రజానికం ఎదురు చూస్తోందని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. సోమవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో పురపాలక సంఘం పరిధిలోని డోలపేటకు చెందిన 30 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ నుంచి వంజరాపు రామచంద్రినాయుడు, దోసరి జగన్‌మోహన్, టి.వెంకటరమణ, రామారావు తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు.

కొడిశ, ఒప్పంగిలో టీడీపీ ఇంటింట ప్రచారం

రేగిడి: మండలంలో కొడిశ, ఒప్పంగి గ్రామాల్లో సోమవారం మండల టీడీపీ రెండు టీమ్‌లుగా వీడి ఇంటింట ప్రచారం నిర్వహించారు. రాజాం అసెంబ్లి టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌రావు, టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుకు మద్దతుగా ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు వివరించి జగన్ అరాచక, విధ్వంసక పాలనకు వ్యతిరేఖంగా ఓటువేయాలని అభ్యర్థిస్తున్నారు. కోడిశ సర్పంచ్ గురవాన రమేష్, గేదల బాలమూరళి, మాజీ జడ్పీటీసీ మంతిను ఉషారాణి, పాలవలస రామచంద్రినాయుడు, చీకటి అప్పలనాయుడు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బొబ్బిలి: బొబ్బిలి మండలం జగన్నాథపురం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి నుంచి కలవరాయి వైపు పల్సర్ బైకుపై వెళుతున్న ముగ్గురు యువకులు గ్యాస్ ట్యాంకర్‌ను తప్పించబోయి అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో బలిజిపేట మండలం పెదంకలాం గ్రామానికి చెందిన మరిశర్ల గణేశ్ చేతులపై నుంచి ట్యాంకర్ చక్రాలు వెళ్లడంతో నుజ్జయిపోయాయి. బైకుపై పెదంకలాంకు చెందిన నారాయణ, బొబ్బిలికి చెందిన బంటు నారాయణ ప్రయాణిస్తున్నారు. వారికి కూడా గాయాలయ్యాయి. ఈ ముగ్గురికి స్థానిక సీహెచ్‌సీలో ప్రథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చదలవాడ తెలిపారు.

లారీ ఢీ కొని వ్యక్తి మృతి



ఆరిశెట్టి కాశీ (ఫైల్)

గజపతినగరరం: ద్విచక్రవాహదారుడిని లారీ ఢీకొన్న ఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజపతినగరం పట్టణానికి చెందిన ఆరిశెట్టి కాశీ(65) సోమవారం మధ్యాహ్నం వ్యాపారం నిమిత్తం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయరహదారికి ఆనుకుని ఉన్న బైరిపురం ఆటోస్టాండ్ వద్ద ఉన్న కల్వర్టు దాటుతుండగా బొబ్బిలి నుంచి విజయనగరం వైపు వెళ్తున్న లారీ ద్విచక్రవాహనం వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాశీ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య ప్రమీలా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. శవపంచనామ నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మహిళా ప్రజాగళం విజయవంతం చేయాలి

గజపతినగరం: టీడీపీ అధినేత చంద్రనేత చంద్రబాబు చేపట్టిన మహిళా ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి కోరారు. సోమవారం మరుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద ఆమె మాట్లాడారు. మంగళవారం బొండపల్లి మండల కేంద్రంలో చేపట్టనున్న మహిళా ప్రజాగళం కార్యక్రమానికి చంద్రబాబు హాజరు కానున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో రావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.లక్ష్మునాయుడు, పార్టీ నాయకులు లెంక చిన్నంనాయుడు, సత్తిబాబు, మిత్తిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.